క్లుప్తంగా

104 వాహన సేవలు

వరికుంటపాడు:నార్త్‌కొండాయపాళెంలో వైద్యాధికారిణి ఆయేషా ఆధ్వర్యంలో బుధవారం 104 వాహన సేవలను అందజేశారు. 64మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

స్పెషల్ డ్రైవ్

అల్లూరు: నగర పంచాయతీ పరిధిలోని పాత బస్టాండ్, వైఎస్సార్ కాంప్లెక్స్, బాపూజీ పార్కు ఏరియాలోని పంచాయతీ షాపుల అద్దె బకాయిల వసూళ్లకు పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని, లేకుంటే షాపులను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

మాతమ్మ విగ్రహ ప్రతిష్ట

సోమశిల : అనంతసాగరం మండలం పడమటి కంభంపాడులో మాతమ్మ ఆలయంలో మూడ్రోజులుగా జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, కాంట్రాక్టర్ ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో అన్నప్రసాద వితరణ చేశారు.

జీవాలకు నట్టల నివారణ మందు

ఉదయగిరి/వరికుంటపాడు: ఉదయగిరి మండలం గండిపాళెం, వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి, విరువూరు, టీసీపల్లి, కొండాయపాళెం, వరికుంటపాడు, తదితర గ్రామాల్లో బుధవారం నట్టల నివారణ కార్యక్రమం చేపట్టారు. గండిపాళెంలో పశువైద్యాధికారిణి అనూష,పెద్దిరెడ్డిపల్లి పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది జీవాలకు నట్టల నివారణ మందు అందజేశారు.

భూముల మంజూరుకు వినతి

అనుమసముద్రంపేట: నిరుపేద ముస్లింలకు సాగు భూములు మంజూరు చేయాలని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ స్టేట్ మీడియా ఇన్‌చార్జి మహమ్మద్ హసన్‌బేగ్, జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ షకూర్ కోరారు. ఈ మేరకు మండల డిప్యూటీ తహసీల్దార్ డీ వెంకటేశ్వర్లుకు పేద ముస్లింలతో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ముస్లింల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వ భూములు మంజూరు చేయాలని కోరారు. మహ్మద్ రఫీ, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుపై శిక్షణ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలకు బుధవారం శిక్షణా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి సభ్యత్వ నమోదు చేపడుతున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చంద్రా మధు, జీ రఘు, జూపల్లి రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌పీఓ విచారణ



మర్రిపాడు: కేతిగుంట పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో డీఎల్‌పీఓ నారాయణ బుధవారం విచారణ చేపట్టారు. 2021-24 మధ్యన పంచాయతీలో చేపట్టిన పనులను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు ఉన్నారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. 1వ వార్డుకు చెందిన అల్లూరి రమణయ్య, 5వ వార్డుకు చెందిన పసుపులేటి పెదపెంచలయ్య, 14వ వార్డుకు చెందిన బీ చొడమ్మ, 23వ వార్డుకు చెందిన యాకసిరి నారాయణమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు పట్టణంలోని ట్రస్టు కార్యాలయంలో ట్రస్టు నిర్వాహకులు బుధవారం నగదు చెక్కులను అందజేశారు. ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, నరసింహరెడ్డి, టీ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సెలవుపై వెళ్లిన తహసీల్దార్

మర్రిపాడు: మండల తహసీల్దార్ జే స్వప్న సెలవుపై వెళ్లారు. వ్యక్తిగత కారణాలతో బుధవారం నుంచి మూడు నెలల పాటు సెలవు పెట్టారు. అప్పటి వరకు డీటీ అనిల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించనున్నారు.

మర్యాదపూర్వకంగా..

చేజర్ల: ఆత్మకూరు నూతన ఆర్డీఓ బీ పావనిని టీడీపీ మండలాధ్యక్షుడు రావి లక్ష్మీనరసారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆత్మకూరులోని కార్యాలయంలో ఆర్డీఓకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కాంపోజిట్ గ్రాంట్ మంజూరు

ఆత్మకూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు కాంపోజిట్ గ్రాంట్ మంజూరైనట్లు ఎంఈఓ-2 కే చలపతి బుధవారం తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలల నిర్వహణకు గ్రాంట్ మంజూరు చేసినట్లు చెప్పారు. గత వారమే టాయిలెట్ క్లీనర్లు కార్యాలయానికి చేరగా వాటిని ఆయా పాఠశాలలకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

దోమల దండయాత్ర




డ్రైనేజీ పూడికతో నిండి నిల్వ ఉన్న మురుగు



హిందూనగర్‌లో పూడిపోయిన డ్రైనేజీ

వింజమూరు మేజర్ పంచాయతీలో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కాటేస్తూ జనులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దోమకాటుతో చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు జ్వరాల బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇటీవల పడుతున్న వర్షాలకు తోడు డ్రైనేజీలు పూడిపోయి మురుగు నిల్వ ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమల నివారణకు చర్యలు చేపట్టాల్సిన పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



- పూడికతో నిండిన డ్రైనేజీలు
- ముందుకు కదలని మురుగు
- విజృంభిస్తున్న దోమలు
- మూలకు చేరిన ఫాగింగ్ మెషిన్లు
- పెరుగుతున్న జ్వరపీడితులు
- నివారణ చర్యలు చేపట్టని పాలకులు, అధికారులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మేజర్ పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్లపై నీరు నిల్వ ఉంటోంది. దీనికి తోడు డ్రైనేజీలు పూడిపోయి మురుగు పారడం లేదు. డ్రైనేజీల్లో క్రమం తప్పకుండా పూడిక తొలగించి బ్లీచింగ్, మలాథియాన్ పిచికారీ చేయాల్సిన పంచాయతీ అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో దోమలు విజృంభించి ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు బీసీ కాలనీ, ఎస్టీకాలనీలో నివాసాల్లోకి నీరు చేరింది. ఈ నీటిలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. వెంగమాంబనగర్, హిందూనగర్, వైశ్యాబజార్, యాదవవీధి, తదితర ప్రాంతాల్లోనూ దోమల సమస్య తీవ్రంగా ఉంది. దోమల కారణంగా మలేరియా, డెంగీ, తదితర జ్వరాల బారిన పడి ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. నిత్యం ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో జ్వరపీడితుల కేసులు సుమారు 200కుపైగా నమోదవుతున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

మూలకు చేరిన ఫాగింగ్ మెషిన్లు

వింజమూరు పంచాయతీకి వివిధ పన్నుల రూపంలో ఏటా రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది. అయినా దోమల నివారణకు చర్యలు మాత్రం అంతంతమాత్రమే. పంచాయతీకి రెండు ఫాగింగ్ మెషిన్లు ఉన్నా మరమ్మతులకు గురయ్యాయని మూలన పడేశారు. పంచాయతీ సమావేశాల్లో వార్డు సభ్యులు తమ ప్రాంత సమస్యలపై గొంతెత్తిన ఫలితం కనిపించడం లేదు. సర్పంచ్‌ను పలుమార్లు సమస్యలపై పాలకవర్గ సభ్యులు నిలదీసినా ఆమె వ్యవహార శైలిలో మార్పులేదనే విమర్శలు ఉన్నాయి. నిధుల వినియోగం కూడా నిబంధనల మేరకు లేదని, నిధులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వినిస్తున్నాయి. కనీసం ఫాగింగ్, మలాథియాన్ పిచికారీ వంటి దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడం అందుకు ఊతమిస్తోంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, పాలకులు స్పందించి దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి



పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వర్షాలకు నీరు నిల్వ ఉండి దోమలు విజృంభించడంతో జ్వరాలు వ్యాపిస్తున్నాయి. అధికారులు స్పందించి వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుని దోమల నివారణకు ఫాగింగ్‌తో పాటు మలాథియన్ వంటి మందులు పిచికారీ చేపట్టాలి. – సుధాకర్

పారిశుధ్య చర్యలు చేపడతాం

వర్షకాలంలో వీధుల్లో నీరు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించాం. వింజమూరులో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపడుతాం. డ్రైనేజీల్లో పూడికతీత చేపట్టి దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ చల్లించడంతో పాటు దోమల నివారణ మందులు పిచికారీ చేయిస్తాం. – శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ,వింజమూరు

ప్రయాణికులకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న డీఎం కరీమున్నీసా, డాక్టర్ కృష్ణ

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు డిపోలో బుధవారం లక్కీడిప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం కరీమున్నీసా మాట్లాడుతూ ఆత్మకూరు-సోమశిల మార్గంలో ఆక్యుపెన్సీ రేషియోను పెంచడంలో భాగంగా ఆత్మకూరుకు చెందిన శ్రీవారి ఆస్పత్రి సహకారంతో ప్రతినెలా లక్కీడిప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా లక్కీడిప్‌లో ఎంపికైన టీ నజీర్, సుశీలమ్మకు ఆస్పత్రి డాక్టర్ కృష్ణ చేతుల మీదుగా హెల్త్ చెకప్ ప్యాకేజీ గిఫ్టులు అందజేసినట్లు వివరించారు. అసిస్టెంట్ మేనేజరు కల్పన, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

28న స్పెషల్ గ్రీవెన్స్‌డే



అధికారులకు ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఆర్డీఓ పావని

సోమశిల: అనంతసాగరం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈ నెల 28న స్పెషల్ గ్రీవెన్స్‌డే నిర్వహించనున్నట్లు ఆత్మకూరు ఆర్డీఓ పావని తెలిపారు. బుధవారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ గ్రీవెన్స్‌కు సంబంధించి మండలాధికారులతో సమీక్షించారు. అనంతరం ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ ఆనంద్ స్పెషల్ గ్రీవెన్స్‌కు హాజరవుతున్నందున పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. మండల ప్రజలు స్పెషల్ గ్రీవెన్స్‌కు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

టిడ్కో గృహాల్లో పోలీసుల కార్డన్ సెర్చ్



టిడ్కో ఇళ్లలోని మహిళలతో మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐలు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం వేకువజామున కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఇద్దరు సీఐలు, 8 మంది ఎస్సైలు, పోలీసు సిబ్బంది కలిసి 900కుపైగా గృహాల్లో సోదాలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి వారి ఆధార్‌కార్డులను పరిశీలించారు. సరైన పత్రాలు లేని 13 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ కే వేణుగోపాల్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, వాటి యజమానులు సంబంధిత పత్రాలు చూపి తీసుకెళ్లవచ్చునని చెప్పారు. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా టిడ్కో గృహ సముదాయంలో తారసపడితే తమకు సమాచారం అందజేయాలని కోరారు. ఆత్మకూరు,సంగం సీఐలు జీ గంగాధర్, కే వేమారెడ్డి, ఎస్సైలు ఎస్‌కే జిలానీ, సాయి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

18 వేల మందికి ఉపాధి కల్పనకు చర్యలు

- డ్వామా పీడీ గంగా భవానీ



మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగా భవానీ

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో సోమవారం నుంచి నిత్యం 18 వేల మందికి ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ గంగా భవానీ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఆత్మకూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఉపాధి సిబ్బందితో బుధవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీల వేతనం ఆధారంగా ప్రభుత్వం మెటీరియల్ కాంపోనెంట్ నిధులు మంజూరు చేస్తుందన్నారు. ప్రతి పంచాయతీలో కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఇటీవల నియోజకవర్గంలో సిమెంట్‌రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా పొలాల్లో ఇంకుడుగుంతల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 24 వేల ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రతి మండలంలో 50 చొప్పున 300 పశువుల షెడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పండ్ల తోటల పెంపకానికి సంబంధించి చిన్న, సన్నకారు రైతులకు మూడేళ్ల కాల పరిమితితో ఒక్కో ఎకరాకు రూ.1.46 లక్షలను అందజేస్తున్నట్లు చెప్పారు. పశువుల మేత కోసం గడ్డి పెంపకం చేపట్టే రైతులకు ఉపాధి నిధులతో ఆర్థిక తోడ్పాటును అందిస్తామన్నారు. ఆత్మకూరు ఏపీఏ శంకర్ నారాయణ, ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఏపీఓలు శిరీషా, వీసీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, డీఈటీలు పాల్గొన్నారు.

గండిపాళెంలో పన్నెండు అడుగులకు నీటిమట్టం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జలాశయంలో నీటిమట్టం 12 అడుగులకు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ కే చంద్రమౌళి బుధవారం తెలిపారు. జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 35 అడుగులు కాగా, ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయం ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద కారణంగా నాలుగు అడుగులు ఉన్న నీటిమట్టం 12 అడుగులకు చేరిందని వివరించారు.

వైభవంగా గ్రామోత్సవం



కలిగిరి: స్థానిక కొత్తూరులో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి మందిరంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం విశేష పూజలు, హోమాలు జరిపారు. నూతన శిలాప్రతిమలను విశేషంగా అలంకరించి ఊరేగించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

సన్మానం



సీతారామపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తూ వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీ అయిన ఎస్వీఎస్ వరప్రసాద్‌ను సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు జయరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఆధార్‌కార్డులు

ఆత్మకూరురూరల్: గ్రామాల్లో ఆధార్‌కార్డులు లేని గిరిజనులను గుర్తించి మంజూరు చేయించేందుకు పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ లబ్ధిదారుల జాబితాల పరిశీలనను రెండ్రోజుల్లో పూర్తి చేయాలన్నారు. సొసైటీల్లో లావాదేవీలు నిలిపేసిన సభ్యులను గుర్తించి తెలియజేయాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ సుధీర్

ఆత్మకూరురూరల్: భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే రైతుల నుంచి అందే వినతుల ఆధారంగా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు సుధీర్ పేర్కొన్నారు. మండలంలోని దేపూరులో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. పలు దశల్లో భూముల సర్వే ద్వారా రికార్డులను మదింపు చేశామన్నారు. ఇంకా చిన్నపాటి సమస్యలు ఏమైనా ఉంటే తెలుసుకుని పరిష్కరించేందుకు గ్రామసభలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కాగా 130కుపైగా వినతులు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. సర్పంచ్ వెంకటేశ్వర్లు, డీటీ శాంతిస్వరూప్, సర్వేయర్ రాజా, వీఆర్వో ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

'అపార్' రిజిస్ట్రేషన్‌ను పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

ఉదయగిరి: అపార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను శుక్రవారంలోగా పూర్తిచేయాలని ఎంఈఓ తోట శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు అపార్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా చేయాలన్నారు. యూడైస్ ప్లస్ నందు డ్రాపౌట్స్, విద్యార్థుల వివరాలను నమోదు చేయాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ రీ ఆర్గనైజేషన్ విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు

సంగం : జిల్లాలో రబీ సాగుకు ఎరువులు, పురుగు మందుల కొరత లేకుండా చర్యలు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసా యాధికారి పీ సత్యవాణి తెలిపారు. మండలంలోని పడమటిపాళెం రైతు సేవా కేంద్రంలో ఏఓ శ్రీహరి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో 28వేల క్వింటాళ్ల వరి విత్తనాల పంపిణీకి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 2 లక్షల టన్నుల ఎరువులు అవసరం ఉందని ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. ప్రస్తుతానికి జిల్లాలో 38,500 మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఏడీఏలు శేషగిరి, సుజాత, హార్టికల్చర్ అధికారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు

చేజర్ల/ఉదయగిరి/అనుమసముద్రంపేట: చేజర్ల మండలం తూర్పుపల్లి, కోటితీర్థం, వింజమూరు మండలం గుండెమడకల, ఊటుకూరు, ఏఎస్‌పేట మండలం చౌటభీమవరం, పెద్దబ్బీపురం గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సబ్సిడీపై వరి, పచ్చిశనగ విత్తనాలను అందజేస్తున్నట్లు చేజర్ల, వింజమూరు మండలాల ఏఓలు శశిధర్, శివనాగప్రసాద్ తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు. నవంబర్ రెండో వారంలో నార్లు పోసుకోవాలని అనుమసముద్రంపేట ఏఓ రజని సూచించారు.

మద్యం షాపు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

అనుమసముద్రంపేట: ముస్లింల, హిందువుల ప్రార్థనా మందిరాల ఉన్న ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని హసనాపురానికి చెందిన హిందూ,ముస్లింలు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీరామకృష్ణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హసనాపురంలోని సర్వేనంబర్ 20లోని కొండపొరంబోకు గతంలో ఓ వ్యక్తి ఆక్రమించి దాబా హోటల్ ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుతం ఆ స్థలాన్ని మరోవ్యక్తికి మద్యం దుకాణం ఏర్పాటుకు అప్పగిస్తున్నారని విన్నవించారు. ఈ ప్రాంతంలో హిందూ, ముస్లింల ప్రార్థనా మందిరాలు ఉన్నాయని, మద్యం దుకాణం ఏర్పాటుతో అందరికీ ఇబ్బంది కలుగుతుందన్నారు. స్పందించిన తహసీల్దార్ శ్రీరామకృష్ణ విచారించి న్యాయం చేస్తామన్నారు. గ్రామస్తులు ఖాదర్‌బాషా, నాయబ్, కాలేషా, షంషుద్దీన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రైల్వేట్రాక్‌పై వ్యాపారి మృతదేహం



మాల్యాద్రి మృతదేహం

కావలి: పట్టణంలోని దొడ్లవారివీధికి చెందిన వ్యాపారి పానుగంటి మాల్యాద్రి (50) మృతదేహాన్ని బుధవారం వేకువన 2.30 గంటలకు ఉదయగిరి బ్రిడ్జి వద్ద ట్రాక్‌పై గుర్తించినట్లు కావలి రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. రైల్వే పోలీసుల వివరాల మేరకు...దొడ్లవారివీధికి మాల్యాద్రి న్యూ బాలాజీ మెడికల్ ఏజెన్సీ పేరుతో వ్యాపారం చేస్తున్నారు. మంగళవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఆయన మెడికల్ ఏజెన్సీ మేనేజర్ వచ్చాడని, ఆయనతో మాట్లాడి వస్తానని భార్య నిరూపకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరారు. అర్ధరాత్రి 12.30 గంటల తర్వాత కుమార్తె ఫోన్ చేయగా ఇంటికి వస్తున్నానని చెప్పారు. అనంతరం ఫోన్ చేస్తే మాల్యాద్రి ఫోన్ లిఫ్ట్ చేయలేదు. కాగా నైట్ రైల్వే ట్రాక్ పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న మహేష్ రైల్వేట్రాక్‌పై మృతదేహం గుర్తించారు. రైల్వేట్రాక్ దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడం వల్ల మరణించి ఉంటారని కావలి రైల్వేపోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కావలి : పట్టణంలోని పెద్ద పవనిరోడ్డు లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందారు. వివరాలు.. పట్టణంలోని వెకుంఠపురం ప్రాంతానికి చెందిన మర్రి వెంకయ్య (75) పెద్దపవనిరోడ్డులో సిరిపురం గ్రామం వైపు స్కూటీపై వెళ్తున్నారు. పట్టణ పరిధిలోని సుచేతనగర్ దాటగానే ఎదురుగా కావలి వైపు మోటారుసైకిల్‌పై వస్తున్న గుర్తుతెలియని వ్యక్తి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వృద్ధుడు కిందపడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. తొలుత కావలిలోని ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ ఎస్సై షేక్ గౌస్‌బాషా తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం గుర్తింపు

కావలి: మండలంలోని బల్లదిన్నె రోడ్డు ఎదురుగా గుర్తుతెలియని మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. వీఆర్వోకు సమాచారం అందజేయగా కావలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బల్లదిన్నె రోడ్డుకు ఎదురుగా పడమర వైపు జాతీయ రహదారికి రైల్వేట్రాక్‌కు మధ్యనున్న కాలిబాటలో మృతదేహం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు సుమారు 45ఏళ్ల వయస్సు ఉండవచ్చని, నలుపు రంగు చొక్కా, లోయర్ ధరించి ఉన్నాడని చెప్పారు. మృతదేహం బాగా ఉబ్బిపోయి మొహం గుర్తుపట్టలేని విధంగా ఉందని, నాలుగు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు తెలిపారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

ఆత్మకూరు: మండలంలోని కరటంపాడుకు చెందిన ఉదయగిరి సుధాకర్ (54) అనే వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జిలానీ బుధవారం తెలిపారు. సుధాకర్ ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో గ్రామానికి సమీపంలోని బ్రిడ్జి వద్ద సుధాకర్ మృతి చెంది ఉండడాన్ని కొందరు గుర్తించి బంధువులకు తెలిపారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని పరిశీలించినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు చెప్పారు. జారిపడిపోయి మృతి చెంది ఉంటాడని బంధువులు తెలిపారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.